క్లుప్తంగా

సేవా సంస్థ బ్రోచర్ ఆవిష్కరణ



నరసరావుపేట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూపొందించిన బ్రోచర్‌ను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈనెల 19వ తేదీన స్వచ్ఛంద సేవా సంస్థ నూతన శాఖ ప్రారంభోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కేశానుపల్లిలోని ఎంఏఎం కళాశాలలో నిర్వహించనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని సేవాసంస్థ సభ్యులు ఎమ్మెల్యేని కోరారు. ఎంఏఎం అధినేత శేషగిరిరావు, టీడీపీ నాయకులు వాసిరెడ్డి రవి, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు, ట్రైసైకిల్ అందజేత

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నరసరావుపేట షిర్డీ సాయిబాబా క్షేత్రం నిర్వాహకులు 100 భోజనం ప్లేట్లను బుధవారం అందజేశారు. ఆ పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న దివ్యాంగురాలు బందిర మరియమ్మకు ట్రైసైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మురారిశెట్టి గోపాలబాబు మాట్లాడుతూ పాఠశాలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యర్రం హనుమంతరావు, భానుశ్రీ, క్షేత్ర నిర్వాహకులు కోట్ల చక్రారెడ్డి, రమాదేవి, ముండ్రు శ్రీనివాసరావు, రమాదేవి, ఆర్‌ఎంపీ డాక్టర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ గ్రౌండ్‌లో చోరీకి విఫలయత్నం

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్ బైపాస్‌లోని వీఆర్ క్రికెట్ గ్రౌండ్ కార్యాలయంలో చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. గ్రౌండ్ కార్యాలయం తాళాలను ఇటుక రాళ్లతో పగులకొట్టేందుకు దొంగలు ప్రయత్నించారు. తాళాలు పగలకపోవడంతో ప్రయత్నాన్ని విరమించి అక్కడి నుంచి జారుకున్నారు. గ్రౌండ్ కార్యాలయంలో క్రికెట్ బ్యాట్‌లు, బాల్స్, చైర్స్, మైక్‌సెట్‌తో పాటు క్రీడాకారుల దుస్తులు ఉన్నాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చిన వాకర్స్ విషయాన్ని గుర్తించి గ్రౌండ్ నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి పరిశీలించగా కార్యాలయంలోని వస్తువులు భద్రంగా ఉన్నట్టు గుర్తించారు. అయితే రాత్రివేళల్లో మందుబాబులు గ్రౌండ్‌లో హల్‌చల్ చేస్తున్న సమాచారం. గంజాయి బ్యాచ్‌తో పాటు మద్యం మత్తులో యువకులు రాత్రి సమయాల్లో గ్రౌండ్ పరిసరాల్లో ఎక్కువ సంచరిస్తుండంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

విచారణకు హాజరైన గుంటూరు మాజీ మేయర్

యడ్లపాడు: గుంటూరు నగర మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో యడ్లపాడు మండలంలోని చెంగిచుఖాన్‌పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద విషయమై విచారణ కోసం వచ్చారు. విచారణలో పొందిన సమాచారం, ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు.

పేదరికాన్ని తొలగించడమే పి-4 లక్ష్యం



శావల్యాపురం: పేదరికాన్ని పూర్తిగా తొలగించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయటమే పి-4 పథకం లక్ష్యమని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీ, ఆరోగ్య ఆశ కార్యకర్తలకు పి-4 పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం అంటే నగదు కాదని మాట సహాయం చిరువ్యాపారులు ఏర్పాటుకు ఆర్థిక చేయూత డబ్బు ఉన్న వారి కాకుండా తెలివి తేటలు ఉన్న వారందరు పి-4 పథకంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ విధంగా చేయటం ద్వారా పేదవారందరు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, తద్వారా జీడీపీ వృద్ధిని సాధించవచ్చునన్నారు. పి-4 పథకంలో ఎవరికైనా సహాయం చేస్తే ప్రభుత్వ పథకాలు కోల్పోతారనే ప్రచారం అవాస్తవమన్నారు. అంతేకాకుండా ఇతర ప్రభుత్వ పథకాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

బోధించే వారు.. వినేవారు కరువు

- కారుమంచి జడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి ఇదీ
- ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు



కారుమంచి జడ్పీ ఉన్నత పాఠశాల

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొని ఉంది. ఇదే విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పాఠశాల్లో (ఐదు మంది ఉపాధ్యాయులు) సైన్సు ఉపాధ్యాయులు పీఎస్, ఎన్ఎస్, వ్యాయామ ఉపాధ్యాయులు, సోషల్, హిందీ బోధించే ఉపాధ్యాయులు కొరత కారణంగా విద్యార్థుల సంఖ్య పూర్తిస్థాయిలో తగ్గింది.

నియోజకవర్గంలో పేరుగాంచిన పాఠశాల కావడం ప్రముఖులు చదువుకున్న పాఠశాల పరిస్థితి ఉపాధ్యాయుల కొరతతో దయనీయంగా మారిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అలాగే పాఠశాల క్రీడామైదానం విద్యార్థులు ఆడుకునే విధంగా లేదని ముళ్లకంచెలతో అధ్వానంగా తయారైందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. గతంలో 290 ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 193 మంది చేరింది. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు కొరతను భర్తీ చేసి పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **ఉపాధ్యాయుల కావాలి**
>
> పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం ఉంది. అలాగే లెక్కలు బోధించే ఉపాధ్యాయులు అంగవైకల్యంతో ఉండటం చేత పూర్తిస్థాయిలో బోధన చేయలేకపోతున్నాం. ఉపాధ్యాయులు కొరత వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది.
>
> – విల్‌సెంట్ ఫిలోమెన్, ప్రధానోపాధ్యాయులు

సాగులో నైపుణ్యత కోసమే 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం

ఏవో ఎ.హరిప్రసాద్

యడ్లపాడు: రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ తెలిపారు. మండలంలోని లింగరపాలెం, సొలస గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేలా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, కందులు వంటి పంటలకు పాటించాల్సిన మెలకువలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ ఏడాది పొగాకు సాగు వేయవద్దని, రైతులకు పంట నమోదు తప్పనిసరి అని సూచించారు. ఈ క్రాప్ నమోదుతో పంటకు మద్దతు ధర లభించడమే కాకుండా, పంట కొనుగోలు కూడా జరుగుతుందని ఆయన చెప్పారు. పత్తి పంట వేసే రైతులు ఎకరానికి రూ.1,900 ప్రీమియం చెల్లించుకుంటే, పంట నష్టం జరిగితే బీమా వర్తిస్తుందని తెలిపారు.

విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేసి, తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు జీవన్ నాయక్, ప్రసన్న కుమార్, గ్రామ వ్యవసాయ సహాకులు వినయ్ కుమార్, గోపి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ సభ



చిలకలూరిపేట: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశంలో పార్టీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు పూనూరు గౌతంరెడ్డి, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి తదితరులు పాల్గొంటారని పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలా మోసం చేస్తోందో నాయకులు వివరిస్తారని వెల్లడించారు.

రేపు 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో 2003లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల ద్వారా ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులు, పోలీసులు, గ్రూప్–2, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాత పెన్షన్ సాధనకై ఈనెల 18వ తేదీన గుంటూరులో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం కన్వీనర్లు సలగాల ప్రసన్నకుమార్, శీలం యలమంద, రాయిడి శ్రీధర్, మారెళ్ల శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలులో ఉన్నప్పుడు మొదలైన నియామక ప్రక్రియను అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నూతన పెన్షన్ విధానంలోకి బలవంతంగా తీసుకరాబడ్డామని వివరించారు. ఆట మొదలైన తరువాత నిబంధనలు మార్చకూడదన్న కనీస న్యాయాన్ని కూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం న్యాయంగా రావలసిన పాత పెన్షన్ ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్న ప్రభుత్వానికి నిరసన తెలియ చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ధర్నాకు ఎస్‌టీయూ ఏపీ మద్దతు..

2003 డీఎస్సీ ఉపాధ్యాయులు చేపట్టిన ధర్నాకు ఎస్టీయూ ఏపీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నట్టు పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఏ.ఏమండీ తెలిపారు. న్యాయంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

బార్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోండి

నరసరావుపేట: మద్యం సేవించేందుకు వచ్చిన శ్రీనివాసనగర్ ఎ.సాంబశివరావును దూషించి దాడిచేసిన జీవనజ్యోతి బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ సంఘటనలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సాంబశివరావును మంగళవారం పరామర్శించి జరిగిన విషయం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ బార్‌లో మద్యం సేవించేందుకు ఈనెల 13వ తేదీ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో వెళ్లి మద్యం సేవిస్తున్న బాధితుడిపై మా ముందే కుర్చీలో కూర్చొని తాగుతావా అంటూ కులంపేరుతో దూషిస్తూ ఇష్టం వచ్చిన రీతిలో కొట్టడంతో సాంబశివరావు స్పృహ కోల్పోవడం జరిగిందన్నారు. బాధితుడు తన భార్యతో కలిసి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేసినా వారు పట్టించుకోకుండా బార్ యజమానికి సపోర్ట్ చేస్తూ బాధితుడు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, నాయకులు షేక్ దర్యావలి, నక్క థామస్, షేక్ సైదా పాల్గొన్నారు.

సృజనతో కూడిన విద్య అందించాలి

జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు అంబటి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అంబటి చెన్నకేశవరావు

చిలకలూరిపేట: విద్యార్థులకు సృజనతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు అంబటి చెన్నకేశవరావు చెప్పారు. బుధవారం ఆయన పట్టణంలోని పోలిరెడ్డిపాలెం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉదయం ప్రార్థనా సమయానికి విచ్చేసి అసెంబ్లీ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నమోదు, హాజరు పరిశీలించి తరగతి వారీగా విద్యార్థులకు నిర్వహిస్తున్న పాఠశాల సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా చదవడం, రాయడం, ఉచ్చారణ దోషాలను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్‌లను పరిశీలించి ఎప్పటికప్పుడు సిలబస్ వారీగా కళ, సాంస్కృతిక కార్యక్రమాలు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.శైలజ, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, కె.అరుణ, జి.ఆదిలక్ష్మి, సీహెచ్ నవ్యశ్రీ పాల్గొన్నారు.


పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



దరఖాస్తు ఫారంను విడుదల చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఈఏడాది కూడా పెనుగొండ వెంకటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్టు ట్రస్ట్ ప్రతినిధులు పెనుగొండ ప్రభాకర్, ప్రతాప్‌లు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు తమ తండ్రి ఇటీవల కాలం చేసారనీ, అయినప్పటికీ ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ ఈ విద్యాసంవత్సరంలోనూ 51 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందివ్వనున్నట్టు స్పష్టం చేశారు. ఈమేరకు దరఖాస్తు నమూనాను బుధవారం విడుదల చేశారు. ఈనెల 16వతేదీ నుంచి ఆగస్టు 15వతేదీ వరకు అర్హులైన పేద ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తులను మల్లమ్మ సెంటర్‌లోని వైభవ్ జ్యువెలర్స్ నుంచి పొంది దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండవ సీతారామాంజనేయులు, మండవ పూర్ణచంద్రరావు, చేగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వివరాలకు 9848677501, 9704360654, 9246453348 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విత్తనాల షాపుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

వినుకొండ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశాల మేరకు వినుకొండ పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను అధికారులు బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎరువులు, పురుగు మందుల లైసెన్స్‌లను, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్ తనిఖీ చేయుట జరిగింది. ప్రతి డీలరు తప్పనిసరిగా స్టాక్ బోర్డు నిర్వహించాలని, స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో ప్రతిరోజు అప్‌డేట్ చేసుకోవాలని రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎంఆర్‌పీ రేట్లకు మించి విక్రయించినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్‌లో నిల్వలు గోదాముల్లో నిల్వలు పరిశీలించడం జరిగింది. తనిఖీల్లో కమిటీ సభ్యులు పి.జి. బుజ్జిబాబు, మహమ్మద్ ఉమర్, బి.సుబ్బారెడ్డి, వినుకొండ ఏవో జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో పలు ఎరువుల దుకాణాలను అంతర్ జిల్లా అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా దుకాణాల్లో స్టాక్ బుక్స్ బిల్లులు ఇన్వాయిస్, భౌతిక నిల్వలు పరిశీలించారు. అదే విధంగా స్టాక్ నిల్వలు వివరాలు ప్రతిరోజు స్టాక్‌బోర్డు యందు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు ఎరువుల మందులు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ తనిఖీల్లో ఏలూరు జిల్లా కోట రామచంద్రపురం సహాయ సంచాలకులు పి.బుజ్జిబాబు, విజయవాడ రీజనల్ విజిలెన్స్ విభాగపు ఇన్‌స్పెక్టరు ఆఫ్ పోలీసు మహమ్మద్ ఉమర్, నూజెండ్ల మండల వ్యవసాయ అధికారి ఆంజనేయ నాయక్‌లు ఉన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న శివకుమారి

నాదెండ్ల: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవన ఎరువులను వాడితే నాణ్యమైన దిగుబడులతో పాటు రైతులకు ఖర్చులు కలిసి వస్తాయని జిల్లా శిక్షణా కోఆర్డినేటర్ ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని తూబాడు గ్రామంలో నరసరావుపేట జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలను ఖాళీగా ఉంచకుండా పంటలతో కప్పి ఉంచినట్లయితే సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పురుగు మందులను అవసరాన్ని బట్టి మాత్రమే వినియోగించాలని సూచించారు. రైతులు రసాయన ఎరువులపై మితిమీరి ఖర్చు పెట్టకుండా వ్యవసాయశాఖ సూచనలను పాటించి జీవన ఎరువులు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీలత, ఎం. అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు చర్యలు

బొల్లాపల్లి: దోమ కాటు వలన మలేరియా డెంగ్యూ చికున్ గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నివారించడానికి ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రేయింగ్ (ఐఖ)ను ప్రతి ఇంటి లోపల చేయించాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ తెలిపారు. మండలంలోని లింగంగుంట తండా చెంచుకుంట తండాలను బుధవారం స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు ఆయా తండాల్లో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయించారు ఈ సందర్భంగా డిఎంఓ మాట్లాడుతూ ఆరోగ్యసిబ్బంది తోపాటు పంచాయతీ సిబ్బంది కలిసి ఆయా గ్రామాల్లో మలాథియాన్ స్ప్రే చేయించాలన్నారు. ప్రతి సచివాలయానికి మలాథియాన్ అందజేశామని తెలిపారు పంచాయతీ అధికారులు చొరవ చూపి ప్రతి ఇంటిలో గోడలపై స్ప్రే చేస్తే దోమలను పూర్తిగా నివారించవచ్చునని దోమకాటు గురికాకుండా చూసుకోవచ్చు అన్నారు తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు మలాథియాన్ నెలలో కలిపిన మిశ్రమాన్ని ప్రతి ఇంటిలో గోడలపై స్ప్రే చేస్తే దోమలు గోడలపై వాలవని తెలిపారు. ఇందుకు గ్రామస్తులు పూర్తిగా సహకరించి వారి ఇళ్లలో లోపలి గోడలపై స్ప్రే చేయించుకోవాలన్నారు.

కేసుల రాజీతో సత్వర న్యాయం

- మీడియేషన్ ఫర్‌ది నేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నరేంద్రరెడ్డి



ర్యాలీ ప్రారంభిస్తున్న నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: కక్షిదారులు కేసులను రాజీ చేసుకోవడం ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మీడియేషన్ ఫర్‌ది నేషన్ పై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు.

ర్యాలీని అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు వద్ద నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమాని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎటువంటి కేసులనైనా రాజీ చేసుకోవచ్చని వెల్లడించారు. ఇలా రాజీ చేసుకోవడం వలన ఎన్నో ఏళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయని చెప్పారు. దీనివలన కోర్టు సమయం వృధా కాకపోవడంతో పాటు మిగిలిన కేసులను త్వరగా విచారించి పరిష్కరించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు షేక్ రహంతుల్లా, పి.హజరతయ్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల వన్‌కే వాక్



వన్ కే వాక్ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి, బార్ సభ్యులు

వినుకొండ : జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు పట్టణంలో మధ్యవర్తిత్వం– దేశం కోసం అనే 90 రోజుల కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు వన్‌కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.మహతి పాల్గొన్నారు. అనంతరం కోర్టు నందు మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం సెప్టెంబరు 30వ తేదీ వరకు జరుగుతుందని, మధ్యవర్తిత్వం ద్వారా వినుకొండ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ కక్షిదారులు రాజీ చేసుకొని పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ నాయక్, ఎస్ఐ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ నాయకులు పి.గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, పీవీ రమణరెడ్డి, వి.శివశంకర్‌బాబు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అధికృత డీలర్లు వద్ద కొనుగోలు చేయాలని పాకెట్ మీద ఉన్న లాట్ నంబరు కొనుగోలు రశీదు మీద లాట్ నంబరు కూడా ఒకే విధంగా ఉండేలా దుకాణాదారులు చూడాలని అంతర్ జిల్లా కమిటీ అధికారి ఏలూరు జిల్లా కోట రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.జి.బుజ్జిబాబు అన్నారు. బుధవారం శావల్యాపురంలో ఎరువుల, విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరు ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు ఎరువుల కట్టలపై ముద్రించినటువంటి ధరలకే కొనుగోలు చేయాలన్నారు. అలాగే ఎరువుల కొరత లేకుండా నిరంతరం మండల స్థాయి వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఎరువులు విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధింత డీలరు వద్ద నుంచి తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. అనంతరం సొసైటీ గోదాంలో ఎరువుల నిల్వలు రికార్డులు పరిశీలించారు. ఈ తనిఖీల్లో మహమ్మద్ ఉమర్, సుబ్బారెడ్డి, ఏవో రామినేని రామారావు సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు ఉన్నారు.